భారత్-చైనా... శాంతి, యుద్ధం, వాణిజ్య బంధం!!

భారత్, చైనాల మధ్య కొన్ని సారూప్యతలున్నాయి.. రెండూ ఆసియా ఖండ దేశాలు.. రెండూ అధిక జనాభా దేశాలు.. రెండూ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలే.. సింగపూర్ మంత్రి మెంటర్ లీ కౌన్ వ్యూ- అభిప్రాయం ప్రకారం- భారత్, చైనాలు శక్తివంత దేశాలుగా ఎదగడం ద్వారా ప్రపంచంలో అంతర్జాతీయ సమీకరణాలను సమూలంగా మార్చివేయగలవు! ప్రపంచ శ్రామికశక్తిలో భారత్, చైనాల వాటా.. 40 శాతం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఈ రెండు దేశాల వాటా 19 శాతం(పర్చేసింగ్ పవర్ పారిటీ ప్రకారం). వచ్చే 20 ఏళ్లలో ప్రపంచ జనాభాలో శాతం ఎంతో... ఆర్థిక వ్యవస్థల పరంగా కూడా అంత వాటాను సొంతం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది!!

ఆసియా పునర్‌వైభవ వికాసం... భారత్, చైనాలు ఎంత బాగా కలిసి పనిచేస్తాయి..! అనే విషయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని మెంటర్ లీ కౌన్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాలు వైరిపక్షాల్లో ఉండకుండా.. పరస్పరం అనుమాన దృక్కులతో చూసుకోకుండా... ఒకళ్లతో మరొకరు పోటీపడుతూ అవగాహనతో ముందుకు సాగాలన్నారు. అంతేకాకుండా... ఆర్థిక వృద్ధిపరంగా తామెక్కడ ఉన్నాం... ఎక్కడకు వెళ్లాలి! అనే విషయంలో కూడా స్పష్టత చాలా అవసరం. భారత ప్రగతిని ప్రామాణికంగా తీసుకొని చైనా... చైనాను ఆదర్శంగా తీసుకొని భారత్.. తమ ఆర్థిక ప్రగతిని మరింతగా మెరుగుపరచుకోవచ్చు. ఇది ప్రపంచ రాజకీయాల్లో ఆసియా స్థానాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. భారత్ పట్ల చైనా అంచనాల్లో, అభిప్రాయంలో కొద్ది కాలంగా గణనీయంగా మార్పు వచ్చిందని విశ్లేషకుల అంచనా.

ఆ మార్పునకు కారణాలివే..

- విస్తృత ఆర్థిక ప్రగతిని వేగంగా సొంతం చేసుకుంటున్న భారత్... అంతర్జాతీయ వ్యవహారాల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది. దాంతో భారత్‌ను 'ఒక సమగ్ర జాతీయ శక్తి' గా చైనా పరిగణిస్తోంది.
- భారత్‌తో సంబంధాలకు చైనా అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. చైనా తన విదేశాంగ విధానంలో భాగంగా ఆయా దేశాలను నాలుగు కేటగిరీలుగా విభజిస్తుంది. అవి.. 1)అభివృద్ధి చెందుతున్న దేశాలు 2) పొరుగు దేశాలు 3) ఎదుగుతున్న దేశాలు 4) అంతర్జాతీయంగా ప్రభావశీల దేశాలు. భారత్ ఈ నాలుగింటిలో ప్రతి కేటగిరీలోనూ కనిపిస్తోందని చైనా భావిస్తోంది.
- ఆసియాలో రాజకీయ సుస్థిరతకు భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు అత్యంత కీలకమని చైనా భావిస్తున్నట్లు ఆ దేశానికి చెందిన విదేశాంగ విధాన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతాను భవాల దృష్ట్యా రెండు దేశాల మధ్య అత్యున్నత స్థాయిలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.

మన్మోహన్ మాట:

భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాలు ప్రగతిశీల దశలో ప్రవేశిస్తున్నాయని ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. భారత్, చైనాల ఆర్థిక ప్రగతి, అభివృద్ధి... ప్రాంతీయంగా, అంత ర్జాతీయంగా శాంతి, సుస్థిరతలపై దీర్ఘకాలిక సానుకూల ప్రభావం చూపనుందని ఆయన అభిప్రాయపడ్డారు. చెనా పర్యటన సందర్భంగా మన్మోహన్ మాట్లాడుతూ... పరస్పర ప్రయోజనం కలిగించే సహకార ఆర్థిక సంబంధాల ద్వారా... రెండు దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలకు సమగ్రతను చేకూర్చనున్నాయన్నారు. భారత ''తూర్పు వైపు చూపు''(లుక్ ఈస్ట్ పాలసీ) విధానంలో చైనా కేంద్ర బిందువన్నారు.

2005లో చైనా ప్రధాన మంత్రి వెన్ జియబావో భారత పర్యటన సందర్భంగా–శాంతి, ప్రగతికి సంబంధించి భారత్, చైనాల మధ్యవ్యూహాత్మక, సహకార, భాగస్వామ్య సంబంధాల దిశగా కృషి జరిగింది. 2006లో చైనా అధ్యక్షుడు హూ జింటావో భారత పర్యటన సమయంలో... రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల కోసం 10 సూత్రాల వ్యూహాన్ని తెరపైకి తేవడం జరిగింది.

ఆర్థిక సంబంధాలు:

భారత్, చైనా ద్వైపాక్షిక వాణిజ్యం... 2006లో 25 బిలియన్ డాలర్ల నుంచి 2007లో 38.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2006లో 4.12 బిలయన్ డాలర్లుగా ఉన్న భారత వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిటి)... 2007లో 10 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనాకు తక్కువ విలువగల ప్రైమరీ ప్రొడక్ట్స్ మాత్రమే ఎగుమతి అవడంపైనా భారత్ ఆందోళన చెందుతోంది. చైనా మార్కెట్‌లో తన వస్తువుల అమ్మకాలకు భారత్ గట్టి ప్రయత్నం చేయకుంటే... ఈ వాణిజ్యలోటు మరింతగా పెరిగే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్య అసమతుల్యాన్ని తగ్గించేందుకు వీలుగా... నాన్ ట్రేడ్ బారియర్స్, టెక్నికల్ బారియర్స్ ఎత్తివేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత అప్పటి వాణిజ్య మంత్రి కమల్ నాథ్, చైనాను కోరారు. 'రీజనల్ ట్రేడ్ అగ్రిమెంట్'(ఆర్‌టీఏ)పై సాధ్యమైనంత త్వరగా చర్చలు జరపడమే చైనాతో భారత వాణిజ్యలోటు సమస్యకు పరిష్కార మార్గమని చైనాకు చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌టీఏ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను రెండు దేశాలు ఏర్పాటు చేశాయి.

ఆర్‌టీఏకు వ్యతిరేకత:

చైనాతో ఆర్‌టీఏను భారతీయ పరిశ్రమ తీవ్రంగా వ్యతిరేకించిందని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) అధ్యక్షుడు సునిల్ భారతి మిట్టల్ తెలిపారు. ఆర్‌టీఏపై చైనాతో చర్చలు జరిపేటప్పుడు ఎలాంటి తొందరపాటు పనికిరాదని భారతీయ పరిశ్రమకు చెందిన నిపుణులు సూచిస్తున్నారు. ఆర్‌టీఏను అవకాశంగా తీసుకొని చైనా తన చౌకధరల వస్తువులతో భారత మార్కెట్‌ను ముంచెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఆర్‌టీఏ అమల్లోకి వస్తే... చైనాను మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా

గుర్తించాల్సి ఉంటుంది. ఇది భారత్‌కు అంతగా ఇష్టంలేదు. ఎందుకంటే... చైనాకు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ (ఎంఈఎస్) హోదా ఇస్తే... భారత మార్కెట్లను చైనా వస్తువులు ముంచెత్తే (లార్జ్ స్కేల్ డంపింగ్) ఆస్కారముంది. ఇప్పటికే దాదాపు 80 దేశాలు చైనాకు ఎంఈఎస్ హోదాను కల్పించినప్పటికీ... అమెరికా, జపాన్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు అందుకు ఇంకా అంగీకరించలేదు. మరోవైపు భద్రతా కారణాల రీత్యా టెలీకమ్యూనికేషన్స్, పోర్ట్ డవలప్‌మెంట్ వంటి రంగాల్లో చైనా పెట్టుబడులకు భారత్ అనుమతించడంలేదు. భారత్‌లో చైనా పెట్టుబడులకు ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సిరావడం రెండు దేశాల మధ్య ఆర్థిక ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావంచూపుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక సంబంధాలు, భద్రతాసమస్యల మధ్య సమన్వయం సాధించడం రెండు దేశాలకు నిజంగా సవాలే. ఇది ఆసి యాతోపాటు యావత్ ప్రపంచ వ్యూహాత్మక భద్రతా ముఖచిత్రంపై విశేష ప్రభావం చూపే అవకాశముంది.

సరిహద్దు వివాదం–అరుణాచల్ ప్రదేశ్:

భారత్, చైనా సరిహద్దు ప్రాంతంలో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ– లైన్ ఆఫ్ యాక్టువల్ కంట్రోల్) వెంబడి శాంతి, సుహృద్భావాలను కొనసాగించాలని 1993లో రెండు దేశాలు అంగీకరించాయి. ఈ విషయాన్ని 2008, ఫిబ్రవరిలో విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ లోక్‌సభలో మరోమారు గుర్తుచేశారు. ఎల్ఏసీపై స్పష్టత సాధన దిశగా కృషి చేయాలని... సరిహద్దు ఉల్లంఘనలపై సంయుక్త కార్యాచరణ బృందం, నిపుణుల బృందం, సరిహద్దు సిబ్బంది సమావేశాలు, ఫ్లాగ్ మీటింగ్స్ జరిగేలా చూడాలని రెండు దేశాలు నిర్ణయించాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సహా 90,000 కిలోమీటర్ల భారత భూభాగం తనదేనని చైనా అక్రమంగా పేర్కొంటోందని ప్రణబ్ లోక్‌సభకు తెలిపారు. 2008, జనవరి 31న ప్రధాని మన్మోహన్ సింగ్ అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించారు. ప్రధానిగా ఆ రాష్ట్రంలో మన్మోహన్ తొలి పర్యటన అది. 'భారత్‌లో సూర్యుడు ఉదయించే రాష్ట్రం'గా అరుణాచల్ ప్రదేశ్‌ను ఆయన అభివర్ణించారు. ఆ రాష్ట్రం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అయితే, అరుణాచల్ ప్రదేశ్‌లో మన్మోహన్ పర్యటనపట్ల చైనా తన అభ్యంతరం వ్యక్తం చేసింది. చైనా అభ్యంతరాన్ని భారత్ తోసిపుచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ పునరుద్ఘాటించారు.

గత చరిత్ర... యుద్ధం.. శాంతి:

ద పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)... 1949 విప్లవం ద్వారా చైనాకు స్వాతంత్ర్యం సిద్ధించింది. 1949, డిసెంబరు 30న పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను భారత్ గుర్తించింది. 1950లలో భారత్, చైనాల మధ్య శాంతి, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాయి. 1954లో చైనా ప్రధాని జౌ ఎన్ లాయ్ (Zou En Lai) భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. మొదటి ఒప్పందం... టిబెట్‌ను చైనాలో అంతర్గత భాగంగా భారత్ గుర్తించింది. చైనాలో స్వయం పాలిత ప్రాంతంగా టిబెట్

ఉండాలని భారత్ కోరింది. రెండో ఒప్పందం... పంచశీల ఒప్పందంపై రెండు దేశాల సంతకాలు.

పంచశీల ఒప్పందంలోని అంశాలు...

- అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాంతీయ సమగ్రతను గౌరవించడం.
- ఇతర దేశంపై దాడికి పాల్పడకపోవడం.
- మరో దేశం అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోక పోవడం.
- సమభావం, సమానత్వం.
- శాంతియుత సహజీవనం.

1962- యుద్ధం:

1950లలో భారత్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో కొంత భూభాగాన్ని చైనా దురాక్రమణ చేసింది. 1962లో భారత్, చైనాల మధ్య యుద్ధం జరిగింది. ఫలితంగా భారత పశ్చిమ ప్రాంతంలోని(లడక్) కొంత భూభాగాన్ని... తూర్పు ప్రాంతంలోని (అరుణాచల్ ప్రదేశ్)కొంత భూభాగాన్ని చైనా ఆక్రమించు కుంది. ఆ నేపథ్యంలో... చైనా ఆధీనంలోని భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం కొనసాగించాలని భారత పార్లమెంటు తీర్మానం చేసింది. అంతేకాకుండా... సరిహద్దు సమస్యల పరిష్కారంలో భాగంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మన భూభాగాన్ని చైనాకు వదులుకునే ప్రసక్తే ఉండరాదని తీర్మానిం చింది. భారత్, చైనాల మధ్య సంబంధాలను సాధారణస్థితికి తెచ్చేందుకు 1980లలో గట్టి ప్రయత్నమే జరిగింది. 1988లో భారత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ, చైనాలో చారిత్రాత్మక పర్యటన జరిపారు. అది రెండు దేశాల మధ్య సంబంధాల్లో కీలక మలుపుగా చెప్పొచ్చు. 1990లో రెండు దేశాల మధ్య విరోధ భావం తగ్గించే ప్రయత్నం(డిటెన్ట్) మరింత ఊపందుకుంది. 1997లో చైనా అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ భారత్‌లో పర్యటించారు. చైనా అధినేత భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆ సందర్భంగా నాలుగు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

అణు పరీక్షలతో అవాంతరం

1998లో భారత్ అణు పరీక్షలు జరపడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించడం ఆరంభమైంది. భారత అణు పరీక్షలు ''అక్రమమని'' కఠినంగా స్పందించిన చైనా... పాకిస్థాన్ జరిపిన అణు పరీక్షలపై మాత్రం కేవలం 'విచారం' వ్యక్తం చేయడంతోనే సరిపుచ్చింది. మరోవైపు భారత్‌లోని కొంతమంది సీనియర్ అధికారులు చైనాను ప్రమాదకారిగా పేర్కొనడం గమనార్హం. 1999, ఏప్రిల్‌లో భారత్‌తో చైనా అధికారికంగా చర్చలు తిరిగి ప్రారంభించింది. 1999, జూన్‌లో విదేశాంగ మంత్రి జశ్వంత్ సింగ్, ఆ తర్వాత 2000లో రాష్ట్రపతి నారాయణన్ చైనా పర్యటనలు... రెండు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి చేరుకోవడానికి సహకరించాయి.

సంబంధాల్లో సరిగమలు:

- బహిరంగంగా, రహస్యంగా పాకిస్థాన్‌కు చైనా అందిస్తున్న సైనిక సహకారం... భారత్‌–చైనా సంబంధాలకు పెద్ద ప్రతిబంధకంగా మారింది. అణు రంగంలో చైనా, పాకిస్థాన్ కలిసి పనిచేయడం... ఆసియాలో తన ఆధిపత్యం కోసం చైనా అనుసరిస్తున్న దీర్ఘకాలిక వ్యూహంగా కనిపిస్తోంది.
- అక్సయ్ చిన్ ఎప్పటికీ పరిష్కారం కాని సరిహద్దు సమస్యగా ఉంది. మరోవైపు అరుణాచల్ ప్రదేశ్‌లోని 90,000 చదరపు కిలోమీటర్ల భూభాగం తనదేనని చైనా చెబుతోంది. సరిహద్దు సమస్యలు పరిష్కారం కాకుండా సాగదీస్తూ... భారత్‌ను వ్యూహాత్మక ఒత్తిడిలో ఉంచాలన్నది చైనా వ్యూహమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- టిబెట్, మయన్మార్‌లలో చైనా తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. ఇది తన జాతీయ భద్రతకు ముప్పుగా భారత్ ఆందోళన చెందుతోంది.

ద్వైపాక్షిక సంబంధాలు... తాజాస్థితి:

- గత సంవత్సరకాలంగా చైనాతో భారతవ్యూహాత్మక, సహకార భాగస్వామ్య సంబంధాలు మెరుగ య్యాయి.
- గత 20 ఏళ్లుగా చైనా రక్షణ బడ్జెట్ శాతం.. మొత్తం బడ్జెట్‌లో రెండంకెల స్థాయికి చేరుకుంది. తద్వారా చైనా సైనిక దళాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఆధునిక రూపురేఖలను సంతరించుకు న్నాయి.
- చైనా రక్షణ దళాల ఆధునికీకరణ భారత భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న విషయంపై లోతైన పరిశీలన జరపాల్సిన అవసరముంది.
- భారత పొరుగు దేశాలతో ప్రధానంగా పాకిస్థాన్‌కు చైనా సైనిక సహకారం... జమ్ముకాశ్మీర్‌లో పాక్, చైనా అక్రమంగా ఆక్రమించుకున్న భూభాగం ద్వారా పాకిస్థాన్‌తో చైనా రాకపోకలు పెంచుకోవడం... భారత్‌పై సైనికంగా ప్రత్యక్ష ప్రభావం చూపనుంది.
- సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా భారత్, చైనా సంప్రదింపులు కొనసాగిస్తున్నాయి. పరస్పర విశ్వాస కల్పన చర్యల ద్వారా సరిహద్దు వెంబడి శాంతి, సుహృద్భావాలను కొనసాగించాలని రెండు దేశాలు నిర్ణయించాయి.

2005లో చైనా, భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను ఏర్పరచుకున్నాయి. అయితే, రెండు దేశాల మధ్య పరస్పర అపనమ్మకాలు ద్వైపాక్షిక సంబంధాలకు పెద్ద అవరోధంగా ఉన్నాయ ని విశ్లేషకులు పేర్కొంటున్నారు. చైనాకు 15వ అతిపెద్ద ఎగుమ తిదారు భారత్. అయితే, భారత ఎగుమతులు... చైనా మొత్తం దిగుమతుల్లో 1.46 శాతమే కావడం గమనార్హం.

యాంటీ డంపింగ్ సుంకాలు:

స్వదేశీ పరిశ్రమను కాపాడుకునేందుకు చైనా వస్తువులపై భారత్ పలు యాంటీ డంపింగ్ సుంకాలు

విధించింది. 2009, జూన్‌లో బొమ్మలు, రసాయనాలు, మొబైల్ ఫోన్‌లు, టెక్స్‌టైల్స్‌కు సంబంధించి దిగుమతి నిబంధనలు కఠినతరం చేసింది. 2009, జూన్‌లోనే చైనా నుంచి అల్యూమినియం వస్తువుల దిగుమతులపై 30 సేఫ్‌గార్డ్స్ డ్యూటీని ప్రకటించింది. అదే సమయంలో చైనా నుంచి విటమిన్-సీ దిగుమతులపై ఐదేళ్ల సుంకం విధించింది. భారత ప్రభుత్వం పలుయాంటీ డంపింగ్ సుంకాలు ప్రకటించడంపై చైనా తన ఆందోళన వ్యక్తం చేసింది. రెండు దేశాల మధ్య బలపడుతున్న వాణిజ్య సంబంధాలు దెబ్బతినకుండా.. యాంటీ డంపింగ్ సుంకాల అంశంపై విస్తృత చర్చ జరగాలని ఆ దేశం పేర్కొంది. 2008లో చైనా, భారత్‌ల ద్వైపాక్షిక వాణిజ్యం 34 శాతం మేర పెరిగి 51.8బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశం చైనా.

విదేశాంగ మంత్రుల భేటీ:

థాయ్‌లాండ్‌లోని ఫూకెట్‌లో జరిగిన విదేశాంగ మంత్రుల సద స్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.ఎం.కృష్ణ, చైనా విదేశాంగ మంత్రి యాంగ్ జైచీతో 2009, జూలై 22న భేటీ అయ్యారు. రెండు దేశాలు ఒకదానితో ఒకటి పోటీ పడకుండానే ప్రగతి సాధించేందుకు కావాల్సిన అవకాశం ఉందని కృష్ణ పేర్కొ న్నారు. అనే అంతర్జాతీయ అంశాలపై రెండు దేశాల అభిప్రాయా లు ఒకే విధంగా ఉన్నాయన్నారు. వాణిజ్య సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాలని నిర్ణయించుకున్నాయి... 2010 చివరికల్లా ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని 60 బిలియన్ల డాలర్లుగా నిర్దేశించుకున్నాయి.

ఇలా మేలు:

భారత్, చైనాల మధ్య వాణిజ్య బంధం రోజురోజుకూ బలపడు తోంది. అది 51.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ప్రస్తుతం చైనా అవతరించింది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలు.. ద్వైపాకిక్ష రాజకీయ సంబంధాల పటిష్టతకు దారితీస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో మన్మోహన్ పర్యటనపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడం రెండు దేశాల మధ్య సంబంధాలకు కొంత విఘాతం కాగలదని భావిస్తున్నారు. అయితే, రెండుదేశాలు సమన్వయంతో పనిచేసి, ఘర్షణాంశాల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచిస్తున్నారు. ఇరు పక్షాలు చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు!!